
# పల్లెబ్రతుకే మధురం!



కథానిక

రాత్రేల తెలవారుతూన్నది. తెల్లవారు ఝామున పూర్తిగా నిద్రపట్టిందేమో త్వరగా సన్యాసయ్య లేవలేకపోయాడు. రాత్రల్లా భార్యతో జాగారమే చేసేడు. సన్నిపాత జ్వరం. అప్పుడే పదిహేను దినాలై బాధపడుతున్నది సీతమ్మ. ఇరవై ఒకటో రోజు దాటితేగాని తగ్గదని సుబ్బయ్యగారు చెప్పారు. సన్యాసయ్య ఒక్కడే సపర్యలు చెయ్యవలసి వచ్చింది. భార్యావంక యెవరూ లేరు. తన అన్నమాత్రం దూరంగావున్నాడు, రెండువందలమైళ్లో దూరంలో. తనని అక్కడికి వచ్చేయమన్నాడు. కాని సన్యాసయ్యకి మనసొప్ప లేదు. తన తాతముత్తాతలదగ్గరనుండీ ఆ వూళ్ళోనేవుంటూవచ్చారు. అంచేత స్వగ్రామాన్ని వదలడంకష్టంగాతోచింది. ఉన్నంతలోనే సరిపెట్టుకోవచ్చునీ, తన వృత్తిద్వారా గ్రామంలోని ప్రజల ఆదరాభిమానాలను పొందవచ్చుననీ-యీ విధంగా దూరం ఆలోచించి స్వగ్రామంలోనే వుండిపోయాడు. అయితే తన అన్న పట్నంలో వుండి ఆర్జించేడు; కాని తను పల్లెలో వుండి కూడా యిబ్బందులు పడుతున్నాడు. తను తండ్రివలెనే పాతిక 'అరక'లు చూచుకుంటున్నాడు. పాతిక పుట్లు ధాన్యం ప్రతి సంవత్సరం యీనాముగా దొరుకుతాయి. వాటితోనే కాలక్షేపంచెయ్యాలి. మధ్యమధ్య యిల్లాంటి అవాంతరాలొచ్చినట్లయితే మరీ కష్టంగా వుంటుంది.

ప్రక్కమీంచి లేవడానికి కష్టంగా తోచింది సన్యాసయ్యకి. అయినా లేవకతప్పదు. కూతురు తనకన్న ముందుగానే లేచి వీధివాకిలి వూడుస్తూండడం చూచి తనమట్టుకితానే సిగ్గుపడిపోయాడు. ఎనిమిదేండ్ల పిల్ల—అల్లారుముద్దుగా పెరగవలసిన పిల్ల—యిలా కష్టపడుతున్నందుకు తను దుఃఖించాడు. చంటాడు యింకా లేవలేదు. తను లేచి మంచంమీద కూచున్నాడు. భార్య మంచంవంక చూచాడు. మూలుగుతున్నది సీతమ్మ. వెర్రివెర్రిగా చేతులుత్రిప్పి సంజ్ఞలుచేస్తున్నది. మనస్సు దిగులుగావుంది సన్యాసయ్యకి. సీతమ్మ బ్రతుకుతుందా అన్న అనుమానం అప్రయత్నంగా ప్రవేశించింది మనస్సులో.

ఒక్కసారి ఆవులించి-లేచి నుంచున్నాడు సన్యాసయ్య. వీధిలో మాటల అలికిడి వినిపించింది.

"మీ నాన్న ఇంకా లేవలేదా?"

"లేదు..."

"అబ్బో-యెంతదర్జా. ఇంకా పడుకుంటేయెలా? ఆ పని ఎవడు చేస్తాడనుకున్నాడో వీడిబాబు..."

"కోప్పడకండయ్యా-చూస్తానుండండి-"

లోనికివచ్చింది మాణిక్యం.

"ఎవరది?-" అడిగాడు తండ్రి.

"మునసబుగారు ... ఇందాక వాళ్ళ పాలేరు వచ్చాడు. నువ్వు పడుకున్నావని చెప్పాను. మళ్ళీ ఇప్పుడు ఆయనే వచ్చాడు."

"సరే...!' అంటూ-ఎదురుగుండా బల్లమీద వుంచిన ఉలీ, బాడిశా పట్టుకుని గుమ్మందిగాడు సన్యాసయ్య.

పి. వి. పల్లి

"ఏమోయ్-ఇంత మొద్దునిద్దరైతే యెలా! అవతల వ్యవసాయం పనులు యెల్లా సాగుతాయ్-ఒళ్ళు పొగరెక్కిందా? ఉండుండు-ఈ సంవత్సరం ఒక్కగింజా కూడా ఇవ్వను..." కళ్ళెర్రజేస్తూ వల్లించుకుపోతున్నాడు రామయ్యనాయుడు.

సన్యాసయ్య దించిన బుర్రయెత్తలేదు. క్రిందని భూమి తిరిగినట్టనిపించింది.

"మా ఇంట్లో సుస్తీగావుందడి-రాత్రి నిద్రలేదు. అంచేత తెల్లారుజామున నిద్రపట్టేసింది. తెలివి రావడం ఆలస్యమయింది."

"నడునడూ-" చరచరా అడుగులేసుకుంటూ ముందు నాయుడుగారూ—వెనక నడవలేక తూల్తూ సన్యాసయ్యా-బయలుదేరారు.

* * *

"ఎలావుందే మీ అమ్మకి"..గుమ్మంయెక్కుతూ అడిగింది చెంచమ్మ.

"ఏంటో అత్తా-మాటలేదూ-తిండీతినదు."

"మందిస్తున్నారుగా సుబ్బయ్యగారు?"

"యిస్తున్నారు. అతనికేమీ యివ్వడంలేదని నాన్న విసుక్కుంటున్నాడు."

మాటలు వినబడ్డాయి కాబోలు తలయిటు త్రిప్పిచూచింది సీతమ్మ. కాని మాటాడలేదు. వెర్రిగా చూసింది.

"మీ పెదనాన్న రాలేదాయింకా?-అడిగింది చెంచమ్మ.

"రాలేదు. వుత్తరం వేశాడు నాన్న. ఇవాళో రేపో రావచ్చును-"

చంటాడు లేచాడు——ఏడుస్తూ.

ఎత్తుకుంది మాణిక్యం. అయినా వూరుకో లేదు వాడు.

"ఆకలిగాబోలు – యింతఅన్నం పెట్టమ్మా" అన్నది చెంచమ్మ.

"రాత్రి మానాన్న తినలేదు. తమ్ముడికీ నాకూ చాలిందికాదు."

"అయ్యో-అదేం విడ్డూరమే, నాయుడిగారి పనిచేస్తున్నాడుగదే నాలుగురోజులయి."

"అయనేమీ యివ్వలేదు. యిదిగో—అదుగో అంటున్నాడు."

"బాగుంది-వుండమ్మా-మాయింటికెళ్లి తెస్తాను" వెళ్లింది చెంచమ్మ.

పదిగంటల వేళయింది. ఎండ కొంచెం వేడిగానేవుంది. రాబోయేది వేసవికాలం. తడబడుతున్న కాళ్లతో బరువుగా అడుగులేసుకుంటూ వచ్చాడు సన్యాసయ్య. గుమ్మంలోకి రాగానే కళ్లు చీకట్లు క్రమ్మేయి. మంచంమీద చేరబడ్డాడు.

"అమ్మా..." నిట్టూర్చాడు.

"రానాన్నా—అన్నం తిందువుగానీ—" అన్నది మాణిక్యం. ప్రాణం లేచివచ్చి నట్టనిపించింది. మూసినకళ్లు విప్పాడు. ఆశగా చూచాడు.

"చెంచమ్మత్త తమ్ముడికోసం అన్నం తెచ్చింది. అది మన ముగ్గురికీ చాలును. తమ్ముడికి పెట్టేను. నువ్వురా"

"ఏం గతి పట్టిందమ్మా..."

లేచాడు మెల్లిగా. కాళ్లుకడుక్కుని యెంగిలి పడ్డాడు. నిన్న వుదయం తిన్నతిండి. పగలల్లా బాడితపని; నిన్నను పెద్దబాడిత—యివాళ చిన్న బాడిత—తన ప్రాణాన్ని తీసేశాయి.

ప్రాణం తెప్పరిల్లింది.

"అమ్మయ్య" అన్నాడు. యెన్నడూలేదు—యివాళ త్రేన్చాడు. కడుపునిండుగా అన్నందొరికి చాలరోజులయింది. వీధి అరుగుమీది కొచ్చాడు. చుట్టముట్టించి మంచంమీద కూచున్నాడో లేదో.

"నాన్నా—అమ్మా"...కేకవేసింది మాణిక్యం భార్యా మంచందగ్గరకి పరుగెత్తేడు.

బట్టలు చింపేస్తున్నది సీతమ్మ. వెర్రి వెర్రికేక వేస్తున్నది. కళ్లు పెద్దవిచేసి చూస్తున్నది. పిలిచాడు, సీతమ్మ పలకలేదు.

"సుబ్బయ్యగారి దగ్గరికి వెళ్లొస్తానుండు నాన్నా" పరుగెత్తింది మాణిక్యం.

"సన్యాసయ్యా" – వీధిలోనుండి పిలుపువినబడింది.

"ఎవరది?——" లోపలనుండే అడిగాడు.

"ఏం, యింకా రావూ?——" కేక ప్రతిధ్వనించింది. యివతలకొచ్చాడు. మరెవరు?—నాయుడిగారి పాలేరు.

"మావాళ్లకి జబ్బు తిరగేసిందయ్యా. వైద్యుడికోసం మాపిల్ల వెళ్లింది...యిదేదో చూచుకొని వస్తానని చెప్పు——"

"నీ పెళ్లాం యేమీ అయిపోదులే. ఆయన గోరు రమ్మంటున్నారు. రాకపోతే కోపగించుకుంటారు."

"మరెలా రావడం, జబ్బుమనిసి నొదిలిపెట్టి?-"

"మరేం పర్వాలేదు రావయ్యా. నీ పెళ్లాం చనిపోదులే."

"సరే మాపిల్లని రానీవయ్యా, వస్తాను—"

"ఏమో అదంతా నాకు తెలీదు. వస్తావా—రావా?—"

సన్యాసికి ఒళ్లుమండింది.

"వస్తానని చెబుతున్నాను గదయ్యా" ...... అన్నాడు గట్టిగా.

"యేందయ్యోయ్ — గట్టిగా మాటాడుతున్నావ్. మా నాయుండి గోరితో సెప్పగల్ను."

"చెప్పు—ఏంచేస్తాడయ్యా మీ నాయుడు."

ఎక్కడనుంచి వచ్చిందో ధైర్యం— ఆ మాట అనడానికి? అలాంటి మాట యెప్పుడూ అనలేదు.

"వుండుండు—నీ పని యిలాగ్గాదు —" గొణుక్కుంటూ వెళ్లిపోయాడు రామస్వామి.

అవును. తన భార్యా బ్రతుకు వెలుగు నీడల్లో వుంది. అలాంటిసమయంలో సహాయం చెయ్యడం లేకపోగా, తను చాకిరీ చెయ్యడానికి వెళ్లాలట. మనిషికి ఏకోశానా కనికరంలేదు. అయినా యీ మునసబీ వచ్చింది—మరీ మిడిసి పడుతున్నాడు. కంట్రోలు టైములో గడించిందాంతో డాబా గూడా కట్టేడు! పెళ్లాం తెచ్చిన సొమ్ముతో భూములు కొన్నాడు. యిక మిడిసిపాటుకి అంతంలేదు, ప్రాణాల్ని తినేస్తున్నాడు.

అందుకే అన్నాడు అన్నయ్య — వున్నవూరన్నమాటేగాని—మర్యాదలేదని. అవును. అక్షరాలా నిజం. యేందో—యీవృత్తి వల్ల ఫలితం కనబడ్డంలేదు. నలుగురిలా వ్యవసాయం చేసుకుంటేనే మంచిది. ఒకరితో బాధలేదు.

బుర్రలో ఆలోచనలు పరుగెత్తేయి. యింట్లోకి వచ్చాడు. భార్యస్థితి చూస్తే గుండె నీరయిపోతున్నది. యేదేనా జరిగితే యీ చంటాణ్ణి యెలా పెంచడం? మాణక్యంమాట?—ఛీ—యేమిటీ తన మనస్సు యిలా పరుగెడుతూంది?—

సుబ్బయ్యగార్ని వెంటబెట్టుకు వచ్చింది మాణిక్యం. పేరుబడ్డ వైద్యుడాయన, గడ్డాలు పెంచాడు. తెల్లబారి పోయాయి వెండ్రుకలు.

చెయ్యి చూచాడు వైద్యుడు. ముఖంముందే చెప్పెయ్యడం అతనికి అలవాటు.

"మరేంలేదుగాని—యివాళ గడిస్తే నువ్వు అదృష్టవంతుడివే నోయ్ సన్యాసీ, అయినా యివాళ అమావాస్య గూడానూ. ఆడవాళ్లకి అమావాస్యనాడు జబ్బు యెక్కువౌతుందంటారు. యిదిగోమందు. గంటగంటకే యియ్యి. తేనెతో కలిపి నాలిక్కి రాయి."

"ఏదో తమదయ, దాన్ని బతికించేరా— మీ మేలు మరవను. నాస్థితి మీకు తెలుసును కదా— మీ కష్టముంచుకోను. తలతాకట్టు పెట్టేనా మీ ఋణం తీర్చుకుంటాను."

"ఎందుకైనా మంచిది. మరోమందు గూడా యిస్తాను. కాని."

"ఏంబాబూ........."

"ప్రస్తుతం అయిదు రూపాయలు వుంటే బాగుండును. వెంటనే తెప్పిస్తాను."

గుండెల్లో రాయిపడ్డట్టయింది. వుదయాన్ని చెంచమ్మ అన్నంపెడితేగాని కడుపుకి లేకపోయెనే. బుర్రగిరగిర తిరిగిపోయింది.

"వస్తాపదండి బాబూ ఎక్కడన్నా తెచిస్తా-" నాలుగడుగులు సుబ్బయ్యగార్ని సాగనంపి వెనక్కి వచ్చాడు సన్యాసయ్య.

"డబ్బు ఎలా సంపాదించడం?" పెద్దసమస్యగా పరిణమించింది.

"మునసబుగార్ని అడిగితే!"— ఆలోచన మెదిలింది.

ఛీఛీ—అటువంటి మూర్ఖుణ్ణి అడిగేకన్న వూరుకోవడం వుత్తమం. యివ్వడు సరికదా—పైగా యిష్టంవచ్చినట్లూ తూలనాడుతాడు.

ఏమీ తోచలేదు. ద్వారాని చేరబడి ఆలోచిస్తున్నాడు. పోనీయేబిందె—లేకపోతే మరో వస్తువేదన్నా తాకట్టుపెడితే బాగుండు ననిపించింది. అవన్నీ ఆనాడే చెల్లిపోయాయి.

చెంచమ్మని అడిగితే బాగుండుననిపించింది. కూతురితో ఆలోచించాడు. కూతురు పరుగెత్తింది. కాని వుట్టిచేతుల్తోనే వచ్చింది.

తలమీదికెత్తాడు. బల్లమీద ఉలీ, బాడితా, అంపమూ—యిత్యాదులన్నీ అవుపించాయి.

భార్యా బతికిందంటే అంతేచాలు—తరువాత యివన్నీ యెల్లాగైనా సంపాదించవచ్చును. బాడి తని తాకట్టుపెడితే?—అబ్బే చాలదు. ఉలికూడా కలిపితే? అయినా లాభంలేదు. బల్లమీది సామా నంతా తీశాడు. సంచీలో పెట్టాడు. ఒకడుగు ముందుకి వేశాడు.

తనతండ్రికి—అతని తండ్రి సంపాదించి యిచ్చి నవి ఆ బాడితా, ఆ ఉలీ, యిప్పుడు తను వెచ్చ బెట్టేస్తున్నాడు. దుఃఖం పొర్లుకొచ్చింది. వెనక్కి అడుగువేశాడు. సంచీ బల్లమీద పెట్టాడు. తాకట్టు పెట్టడానికి చేతులురాలేదు. వాటిని అల్లారుముద్దుగా చూసుకుంటున్నాడాయెను.

మునసబుశెప్ప ఆవూళ్లో మరి దాతలేలేరా? వున్నారు. చాలామంది వున్నారు, బయలు దేరాడు. యిద్దర్ని అడిగాడు. ఫలితం లేకపోయింది. "నాయుడుగారి పనిచేస్తున్నావుకదా-అతన్ని అడగ వయ్యా" అన్నారు కొందరు.

ఛీ! ఆ దుర్మార్గుణ్ణి అడక్కూడదు. అంతకన్న సామానుల్ని తాకట్టుపెట్టడమే మంచిది.

అయినా అడిగితే ఏంపోయింది?— అనిపిం చింది మనస్సుకి. మునసబుగారి యింటివేపు సాగిం చాడు నడక.

"ఏరోయ్? ఉత్తిచేతుల్తో వచ్చావ్? ఆయు ధాలు యిక్కడ దొరుకుతాయనుకున్నావా? తాసి ల్దారుగారికి యివాళ యీజీఛైర్లూ, బెంచీలూ పంపి స్తానని మాట యిచ్చానుకదా—అవన్నీ ఎవరుచేస్తా రనుకున్నావ్?" గద్దించాడు రామయ్యనాయుడు.

"అదికాదండి—అయిదురూపాయిలు యిప్పిస్తా రని వచ్చాను—వైద్యుడికివ్వాలి."

"ఎక్కడివీ, యిక్కడ తేరగా కూచున్నాయ నుకున్నావా? పనికి రాకపోవడం సరిగదా—పైగా యిదొకటా. సర్కారు మీకు మాన్యాలిచ్చారు కదా! యిది సర్కారు పనేగాని, నా పనేంగాదు మీకు డబ్బులివ్వడానికి వెళ్ళు—సామాను పట్టు కురా!" హుంకరించారు నాయుడుగారు. పంతులు గారుశెట్టించారు; నాయుడుగార్ని సమర్థించారు.

తన రోదనం అరణ్య రోదనమయిపోయింది. "ఛీ, పల్లెటూళ్లో వుండమని యెవరు చెప్పారు. పూర్వకాలమనుకున్నాను. ఆ మర్యాదలూ—ఆ దాతృత్వాలూ అడుగంటినయి."

తను అయిదురూపాయిలు మరి సంపాదించ లేడా? గుమ్మం యెక్కాడు.

కూతురు అడిగింది— "దొరికిందా నాన్నా డబ్బు?"

"లేదమ్మా!"అన్నాడు ముక్తసరిగా.

బల్లమీద సంచీ తీసాడు. చేతులు వణికాయి. ఏడుపొచ్చింది. గబగబా నడిచి వెళ్ళిపోయాడు వీధిలోకి.

* * *

సుబ్బయ్యగారు అందుకున్నారు సొమ్ము. ఏం ఫర్వాలేదన్నారు. యింటికొచ్చాడు సన్యాసయ్య. గుమ్మంయెక్కేసరికి నామానుల్తో ఆహ్వానించేబల్ల- ఇప్పుడు బోడిగా అవుపించింది. గుండె బరువెక్కి పోయింది.

"నాన్న—అమ్మసంగతి చూడు—" చూపిం చింది తల్లిని మాణిక్యం. చేతులులాక్కుంటున్నాయి. కాళ్లు కూడిపోతున్నాయి. దృష్టిని...లి...చి... పో...యి...ంది... చంటాడు శేర్మన్నాడు. మాణిక్యం గొల్లుమంది. సన్యాసయ్య బావురు మన్నాడు. అందరూ మూగారు.

* * *

"ఆ నాడేచెప్పాను. యీ పల్లెటూళ్లో వైద్య సౌకర్యంకూడా వుండదని. నా మాట విన్నావు కావు. పట్నంలో స్వతంత్రంగా బతకొచ్చును. కూలిదొరుకుతుంది. కనీసం ఒకపూట అన్నమైనా తినొచ్చును. పూర్వకాలం కాదు-యిప్పుడు పల్లె టూళ్ళు మారిపోయాయి. ఆత్మాభిమానం మంట గలిగింది. కులవృత్తులకి స్థానంలేదు. యిప్పుడు నాయుడు కూడా మనల్ని చూడడంలేదు. అందరూ ఉపన్యాసాలిచ్చేవారేకాని, గ్రామాల్లోకి తొంగిచూచే వాడెవడూలేడు. పద. అక్కడే సుఖంగా వుందాం." అన్నాడు అన్న.

"అవును-నువ్వు చెప్పిందే నిజం." అన్నాడు సన్యాసయ్య—, నీరసంగా. ★